# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 23-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక:101 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ఓయూ మాజీ వీసీ రామకృష్ణయ్య కన్నుమూత

హైదరాబాద్, నవంబర్ 22: ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య రామకృష్ణయ్య(87) కన్నుమూశారు. విద్యానగర్‌లోని తన నివాసంలో రామకృష్ణయ్య మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. 1996 నుంచి 1999 వరకు ఓయూ వీసీగా రామకృష్ణయ్య పని చేశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా కూడా ఆయన సేవలందించారు.ఓయూ మాజీ వైస్ ఛాన్సలర్ రామకృష్ణయ్య మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక ఉస్మానియా యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో పాటు విద్యార్థులు రామకృష్ణయ్యకు నివాళులర్పించారు.

### డ్యూటీలు ఇవ్వాలని..

## కార్మికులు డిపోలకు వెళ్లొద్దు

- ఆర్టీసీ సమ్మెను యధాతథంగా కొనసాగిద్దాం
- సమ్మె విరమిస్తామని చెప్పినా ప్రభుత్వం మొండివైఖరి మార్చుకోలేదు
- ఇప్పటికైనా సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం
- నేడు డిపోల ఎదుట 'సేవ్ ఆర్టీసీ' పేరుతో నిరసనలు
- గ్రామాల్లోకి వెళ్లి ఆర్టీసీ కార్మికుల కష్టాలు తెలియజేస్తాం
- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

హైదరాబాద్, నవంబర్22(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరుతామని డిపోలకు వెళ్లొద్దని, ఎలాంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకుంటామని ప్రభుత్వం తెలిపితేనే విధుల్లోకి వెళ్దామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంజీబీఎస్‌లో ఆర్టీసీ జేఏసీ నాయకులు అత్యవసర సమావేశమయ్యారు. సమ్మెను విరమిస్తామని చెబుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సమ్మెను కొనసాగిద్దామని నిర్ణయించారు. అనంతరం అశ్వత్థామరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. సమ్మె యధాతథంగా కొనసాగుతోందన్నారు. సమ్మె విరమిస్తామని చెప్పినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం అన్నారు. ఈ విషయంలో ఇంకా వేచి చూస్తామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. శనివారం ప్రతి డిపో ముందు ర్యాలీ చేపడతామన్నారు. సేవ్ ఆర్టీసీ పేరుతో నిరసనలు చేస్తామన్నారు. గ్రామాల్లోకి వెళ్లి ఆర్టీసీ కార్మికుల కష్టాలు తెలియజేస్తామన్నారు. ఆర్టీసీ జేఏసీ చేసిన సమ్మె విరమణ ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరం అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేనట్టు కనిపిస్తోందన్నారు. కోర్టు తీర్పు గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అశ్వత్థామరెడ్డి అన్నారు. కార్మికులు విధుల్లో చేరినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం అన్నారు. కార్మికులెవరూ విధుల్లో చేరలేదని చెప్పారు. కార్మికులు ధైర్యాన్ని కోల్పోవద్దన్నారు. డ్యూటీలు ఇవ్వాలని డిపోలకు వెళ్లొద్దన్నారు. కార్మికులను విధుల్లోకి చేర్చుకునే అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే.. మరోసారి సమావేశం అవుతామని.. భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్నట్టు కార్మికుల వల్ల ఆర్టీసీకి ఎలాంటి నష్టం జరగలేదన్నారు.




వికారాబాద్ జిల్లా పరిగిలో చనిపోయిన ఆర్టీసీ డ్రైవర్ శవంతో కార్మికుల ఆందోళన

## మనస్తాపంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

- వికారాబాద్ జిల్లా పరిగిలో విషాద ఘటన
- మృతదేహంతో జాతీయ రహదారిపై కార్మికుల ఆందోళన

వికారాబాద్, నవంబర్22(ఆర్ఎన్ఎ) : మరో ఆర్టీసీ కార్మికుడు మృతిచెందాడు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో మనస్థాపం చెందిన వీరభద్రయ్య(42) అనే ఆర్టీసీ డ్రైవర్ మనోవేదనతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కార్మికులు మృతదేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం మండిపల్ గ్రామానికి చెందిన వీరభద్రయ్య.. పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ పనిచేస్తున్నాడు. కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడంతో విధులకు వెళ్లలేకపోయాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది వారం రోజులుగా తినడం మానేసి.. అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో వీరభద్రయ్య తీవ్ర అస్వస్థతకు గురికావటంతో గురువారం రాత్రి వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. భద్రయ్యకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇదిలా ఉంటే ఆర్టీసీ కార్మికులు ఆయన మృతదేహంతో పరిగి డిపో ఎదుట బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఆందోళన చేస్తున్న సమయంలో శ్రీనివాస్ అనే మరో డ్రైవర్ స్పృహతప్పి పడిపోయాడు. అప్రమత్తమైన సహచరులు అతడిని దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. కొద్దిసేపటికి ఆర్టీసీ కార్మికులు వీర భద్రయ్య మృతదేహంతో పరిగి బస్టాండ్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. పరిగి ఆర్టీసీ డిపో వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు కార్మికులను బలవంతంగా అక్కడి నుండి తరలించారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ మనదైన భారతమ్మున
ఘనముగ నాంగ్లమును వ్రాయు కవివర్యులలో
చనుదు నిరాద్. సి. చౌదరి
ననతోసాయు నందు చేసె నవ్య పథమునన్!!

(నవంబర్ 23 రచయిత నిరాద్ సీ. చౌదరి జయంతి)

–రాధశ్రీ
సెల్: 9494481210



## మందుపాతర పేల్చిన మావోలు

### ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలు

రాయపూర్,నవంబర్22(ఆర్ఎన్ఎ): బీజాపూర్ జిల్లా కరేం సమీపంలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు మందుపాతర పేల్చారు. పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు ఈ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో 168వ బెటాలియన్‌కు చెందిన ఓ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన జవాను పరిస్థితి విషమంగా ఉండడంతో సమీప ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ ఘటనతో ఛత్తీస్‌గఢ్ లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలో మావోయిస్టుల కోసం పోలీసులు భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

## నష్టాలతో ముగిసన మార్కెట్లు

ముంబై,నవంబరు 21(ఆర్ఎన్ఎ): భారత స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ఎక్కువ మంది పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు దిగడంతో స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. బాంబేస్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 76 పాయింట్లు కోల్పోయి 40,575 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 31 పాయింట్లు నష్టపోయి 11,968 వద్ద ముగిసింది. టాటా స్టీల్ షేర్లు 3 శాతం, హిందూస్థాన్ యూనిలీవర్ షేర్లు 1 శాతం నష్టపోయాయి. ఎస్ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా నష్టపోగా.. భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ షేర్లు 6 శాతం, బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.73శాతం నష్టపోయి 14,759 వద్ద ముగిసింది.

## చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

### వరుస చోరీలకు పాల్పడ్డ దుండగులు

హైదరాబాద్,నవంబర్22(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ శివారు ప్రాంతమైన హయత్‌నగర్‌లో చెడ్డీ గ్యాంగ్ మరోమారు హల్‌చల్ చేసింది. కుంట్లూర్ గ్రామం కనకదుర్గానగర్ లోని చప్పిడి వెంకట్ రెడ్డి, ఐతరాజు శ్రీనివాస్ ఇండ్లలో వరుస చోరీలకు పాల్పడింది. ముఠా సభ్యులు శ్రీనివాస్ ఇంటి తలుపులు బద్దలుకొట్టి ఇంట్లో వారిని చంపుతామని బెదిరించి సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, రూ. 75 వేల నగదు అపహరించుకెళ్లారు. అయితే పోలీసులు ఇంట్లో దొంగలు దోపిడి చేస్తుండగానే అక్కడికి చేరుకున్నారు. ఇంటిగోడ దూకి దొంగలు పారిపోతున్నా పోలీసులు వారిని పట్టుకోలేకపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

మళ్లీ విజృంభించిన చైన్ స్నాచర్లు

హైదరాబాద్ నగర శివారు రంగారెడ్డి జిల్లా పరిధిలో మళ్లీ చైన్ స్నాచర్లు విజృంభిస్తున్నారు. వనస్థలిపురం ఎఫ్‌సిఐ కాలనీలో ఓ మహిళ మెడ నుంచి దుండగులు నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు వనస్థలిపురం పోలీసులు తెలిపారు. నగరంలో చైన్ స్నాచింగ్ ఘటనలు జరగకుండా పోలీసులు పక్కా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్‌గా చేసుకుని చైన్ స్నాచర్లు విజృంభిస్తున్నారు. దీంతో మహిళలు ఒంటరిగా బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి ఎర్రగడ్డకు తరలింపు

హైదరాబాద్,నవంబర్22(ఆర్ఎన్ఎ): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3 సిగ్నల్ వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి హల్ చల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను ఇబ్బందులకు గురిచేశాడు. సిగ్నల్ వద్ద ఉన్న జనాలపై రాళ్లతో దాడి చేసే ప్రయత్నం చేసాడు. తీవ్ర భయాందోళనకు గురైన వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులపై కూడా దాడికి దిగాడు. కొద్దిసేపు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. పోలీసులు ఆ వ్యక్తిని తాడుతో కట్టేసి ఆటోలో పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిందితుడి పేరు రక్ష రాజు కాగా..అతడు సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్నట్లు సమాచారం.గత కొంతకాలంగా మతిస్థిమితం లేనట్టు తెలుస్తోంది.తిరుమలగిరిలో నివాసముంటున్నట్లు గుర్తించారు. పోలీసులు రాజును ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తరలించారు.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు

### 8మంది కుటుంబ సభ్యుల మృతి

రాయ్‌పూర్,నవంబర్22(ఆర్ఎన్ఎ): ఛత్తీసగఢ్ లోని బిమిత్ర జిల్లాలో శుక్రవారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు చెవరులోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం చెందారు. మహభట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కారు చెరువులోకి దూసుకెళ్లడంతో ఎనిమిది మంది మృతి చెందారు. కలెక్టర్ శిఖరాజ్ పూట్ తివారి ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు 25,000 ఎక్స్ గ్రేషియా ఇస్తామని పోలీసులు వెల్లడించారు. మృతులలో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు, ఒక పాప ఉన్నట్టు పోలీసులు గుర్తించామని ఎస్పి ప్రశాంత్ ఠాకూర్ తెలిపారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం బిమిత్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చనిపోయినవారంత ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసులు గుర్తించినట్టు సమాచారం.



హైదరాబాద్‌లో పర్యావరణ సవాళ్లపై ఏర్పాటైన అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసగౌడ్.

### పర్యావరణ పరిరక్షణకు ..

## తెరాస ప్రభుత్వం పెద్దపీట

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నవంబర్22(ఆర్ఎన్ఎ) : తెరాస ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో పర్యావరణ క్షీణత, సుస్థిర అభివృద్ధి నవాల్‌పై అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోజురోజుకూ పర్యావరణం కలుషితమవుతోందన్నారు. క్షీణిస్తున్న వాతావరణంతో మానవజాతి అంతరించి పోయే ప్రమాదం పొంచి ఉందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఆక్సిజన్ కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. మానవజాతి అంతరించిపోయే ప్రమాదం పొంచి ఉందని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణ రాష్ట్రంలో పెద్దమొత్తంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని కోట్ల మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచే బాధ్యతను ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలు, స్వచ్ఛమైన వాతావరణం పెంపొందించుకొనే విధానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీనికితోడు పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్ఠంగా అమలు చేస్తుందని, గ్రామాల్లోనూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ వారిలో చైతన్యం నింపుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే కాలంలో కాలుష్య రహిత రాష్ట్రంగా, ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవిస్తుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెను ఆగం చేసిన జెఏసి నేతలు

### కార్మికుల మరణాలకు ఎవరు బాధ్యులు

### జేఏసీ-1 కన్వీనర్ హనుమంత్ ముదిరాజ్

హైదరాబాద్,నవంబరు 21(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ జేఏసీ సమ్మె విరమిస్తాం అని చెప్పడం బాధాకరమని ఆర్టీసీ జేఏసీ-1 కన్వీనర్ హనుమంత్ ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీలో పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలే ఎక్కువ సంఖ్యలో వున్నారన్నారు. 48రోజుల సమ్మె, 29 మంది బలిదానాలు గాలికి వదిలేసి ఇప్పుడు సమ్మె విరమిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఆర్టీసీ కార్మికుల త్యాగాలకు న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు. గతంలో ఐఆర్ 16 శాతం తీసుకున్నప్పుడు.. జేఏసీ నాయకులు మంత్రుల చుట్టు తిరిగి విజయం సాధించారని, మరి ఇప్పుడు డిమాండ్‌లు పరిష్కరించడంలో ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదని హనుమంత్ ప్రశ్నించారు. జేఏసీ నాయకుల కారణంగానే.. ఆర్టీసీ సమ్మె ఆగం అయ్యిందన్నారు. సీఎం కేసీఆర్‌ను జేఏసీ-1 నాయకులు కలిసి ఆర్టీసీలో సమస్యలు వివరిస్తామన్నారు. కొందరు ఆర్టీసీ నాయకుల తీరు కారణంగా సీఎం సీరియస్‌గా వున్నారని, అశ్వత్థామా రెడ్డి వల్లనే ఆర్టీసీలో సమస్యలు పెరిగాయని హనుమంత్ ముదిరాజ్ అన్నారు.

## చెన్నమనేనికి హైకోర్టులో ఊరట!

- కేంద్రం జారీచేసిన ఉత్తర్వులపై కోర్టు స్టే
- తదుపరి విచారణ డిసెంబర్ 16కి వాయిదా

హైదరాబాద్, నవంబర్22(ఆర్ఎన్ఎ) : వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన పౌరసత్వం రద్దుచేస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులపై కోర్టు స్టే విధించింది. కేంద్రం ప్రభుత్వ ఉత్తర్వులను నాలుగు వారాలపాటు నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తరవులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 16కి వాయిదా వేసింది. ఈ కేసు విషయమై శుక్రవారం హైకోర్టులో విచారణ జరుగగా, చెన్నమనేని తరపున సీనియర్ న్యాయవాది వేదల వెంకటరమణ వాదనలు వినిపించారు. చెన్నమనేని రమేష్ జర్మనీలో అగ్రికల్చర్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశాడని తెలిపారు. 2008 జనవరిలో భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోగా, 2009లో పౌరసత్వం వచ్చిందని వెల్లడించారు. తర్వాత ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డు జారీ చేసిందని వివరించారు. చెన్నమనేని రమేష్ 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందగా, 2010 ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించారని తెలిపారు. తర్వాత 2014, 2019 ఎన్నికల్లోనూ గెలిచి ప్రజాసేవ చేస్తున్నాడని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు ఈ కేసులో ప్రతివాది అయిన ఆది శ్రీనివాస్ తరపు న్యాయవాది రవి కిరణ్ రావు మాట్లాడుతూ.. భారతీయ పౌరుడు కాని చెన్నమనేని రమేష్ తప్పుడు అఫిడవిట్ పెట్టి ఎమ్మెల్యేగా గెలుపొందారని వాదించారు. చట్టాలను మోసం చేసే వాళ్లు చట్టసభల్లో ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు, ఇప్పుడు హోంశాఖ చెప్పిందని గుర్తు చేశారు. చెన్నమనేని రమేష్‌కు జర్మనీ పౌరసత్వం ఉందని అనేక ఆధారాలు ఉన్నందున హోంశాఖ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఇరు వైపుల వాదనలు విన్న హైకోర్టు స్టే విధించి తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## తరగతిగదిలో పాముకాటు: బాలిక మృతి

తిరువనంతపురం,నవంబరు 21(ఆర్ఎన్ఎ): తరగతి గదిలో పాము కాటుకు ఓ విద్యార్థిని మృతిచెందింది.

ఈ విషాద సంఘటన కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకుంది. సుల్తాన్ బాథరి ప్రాంతంలో గల ప్రభుత్వ పాఠశాలలో ఎస్. శెహలా అనే విద్యార్థిని 5వ తరగతి చదువుతోంది. కాంక్రీట్ ఫ్లోర్ కలిగిన ఆ తరగతి గదిలో

ఓ రంధ్రం ఉంది. ఆ రంధ్రం నుంచి పాము బాలికను కాటువేసింది.

గాయం కాటు గురించి సదరు విద్యార్థినితో పాటు తోటి విద్యార్థులు సైతం ఉపాధ్యాయులకు చెప్పగా గోరు, రాయి లేదా చిన్న ఏదేని వస్తువు వల్ల గాయమై ఉండొచ్చని పట్టించుకోకుండా కొట్టిపారేశారు. గంట తర్వాత బాలిక కాలు నీలం రంగులోకి మారింది. అప్పటికే విషయం తెలిసిన తండ్రి పరుగున పాఠశాలకు చేరుకుని విద్యార్థిని ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరిస్థితి విషమించడంతో బాలిక మృతిచెందింది. జరిగిన ఘటనపై విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించనున్నట్లు కేరళ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ప్రొ.రవీంద్రనాథ్ తెలిపారు.


ఆహ్వానం

తేజ ఆర్ట్ క్రియేషన్స్ & శ్రీ త్యాగరాయ గానసభ

సంయుక్త ఆధ్వర్యంలో





ప్రముఖకవి
ఆచార్య కడారు వీరారెడ్డి గారి
దీర్ఘ కవిత
"భార్యాభర్తల బంధం-ఇగిరిపోని గంధం"
ఆవిష్కరణ

ముఖ్య అతిథి & ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణాచారి గారు ఐఏఎస్(రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు : ఆచార్య మనస చెన్నప్ప గారు
పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ ఉ.వి.

విశిష్ట అతిథి : శ్రీ వి.ఎస్. జనార్ధనమూర్తి గారు
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

గౌరవ అతిథులు : శ్రీ దాస్యం సేనాధిపతి గారు
ప్రముఖ కవి, విమర్శకులు

: శ్రీ బైస దేవదాసు గారు
సంపాదకులు, 'నేటి నిజం' దినపత్రిక

వేదిక: శ్రీమతి కళా లలిత కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్.

తేది: 27-11-2019 (బుధవారం) సమయం: సా॥ 6.00 గం॥లకు

ఆహ్వానించువారు

శ్రీమతి కళా శారద
ప్రధాన కార్యదర్శి
శ్రీ త్యాగరాయ గానసభ

డా॥ పోరెడ్డి రంగయ్య
అధ్యక్షుడు
తేజ ఆర్ట్ క్రియేషన్స్

# కుటుంబ కలహాలతో పెట్రోల్ పోసి నిప్పు

## క్షతగాత్రులను గాంధీకి తరలింపు

సిద్దిపేట,నవంబర్22(ఆర్ఎన్ఎ): కొండపాక మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. భార్యభర్తల మధ్య గొడవ కారణం గా.. కక్షగట్టిన బావ తన బావమరిది కుటుంబ సభ్యులపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. గురువారం రాత్రిసమ యంలో ఈ ఘటన జరిగింది. లక్మి రాజాం అనే వ్యక్తి తన భార్య రాజేశ్వరితోపాటు బావమరిది కుటుంబసభ్యులపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. ఈ ఘటనలో రాజు, విమల, పవిత్ర, సునీత, చింటూ, రాజేశ్వరికి తీవ్రగాయాల య్యాయి. తీవ్రగాయాలతో ఉన్న క్షతగాత్రుల ను గ్రామస్తులు ప్రాథమిక చికిత్స కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ కి తరలించారు. మిగతా ముగ్గురు సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య తగాదాలకు ఈ సంఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

# కొడుకు మరణవార్తను దిగమింగి

## కూతురికి పెళ్లి కానిచ్చిన తండ్రి

కాన్పూర్,నవంబర్22(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్‌లోని ఝింఝూక్ ప్రాంతం కరియఝూలా గ్రామంలో ఒక వైపు తనయుడు మరణించిన బాధను కడుపులో ఉంచుకొని కన్న కూతురు పెళ్లి చేశాడు ఓ తండ్రి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామ్ నరేష్– కిరణ్ అనే దంపతులకు కూతురు అంజు, కుమారులు హిమాన్షు, సుమిత్‌లు ఉన్నారు. రామ్ నరేష్ తన కూతురు పెళ్లి అంగరంగా వైభవంగా చేయాలనుకున్నాడు. అంకిత్ అనే యువకుడితో తన కూతురు వివాహం నిశ్చయం చేశాడు. పెళ్లి మూహూర్తానికి రెండు గంటల ముందు పెళ్లి వేడుకలో మరిచిపోయిన కొన్ని వస్తువులు తీసుకరావాలని తన చిన్న కుమారుడు హిమాన్షుకు బైక్ ఇచ్చి పంపించాడు. రామ్ నరేష్ బంధువులు, స్నేహితులు అందరూ పెళ్లికి హాజరయ్యారు.

కానీ హిమాన్షు కనిపించడంలేదని అందరూ అడుగుతున్నారు. కానీ హిమాన్షు ఫోన్ నుంచి తన తండ్రికి ఓ కాల్ వచ్చింది. హిమాన్షు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని తెలియగానే తండ్రి కుప్పకూలిపోయాడు. కానీ కుమారుడి మరణవార్త తన కుటుంబ సభ్యులు తెలియకుండా దాచి పెట్టి మనోనిబ్బరంతో తన కూతురు పెళ్లి చేశాడు. వధువుకు వరుడు తాళి కట్టిన మరుక్షణం హిమాన్షు చనిపోయాడని బంధువులకు తెలిపాడు. ఇక తనకు కుమారుడు లేదని, రోడ్డు ప్రమాదంలో గంట ముందు చనిపోయాడని తెలిపాడు. ఓ కన్నతండ్రి పడే బాధను చూసి బంధువులు అందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. కన్న కూతురు పెళ్లి ఆగిపోకుడదనే ఉద్దేశ్యంతో కుమారుడి మరణవార్త చెప్పలేదని ఏడుస్తూ చెప్పాడు. దీంతో పెళ్లింట విషాదం నెలకొంది.

# అమరావతిని నిర్వీర్యం చేస్తున్నారు

- రైతుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు వైసీపీకి పట్టవా?
- బాబుకు పేరొస్తుందని దుర్మార్గంగా ఆలోచిస్తున్నారు
- టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజా

గుంటూరు, నవంబర్22(ఆర్ఎన్ఎ) : ఏపీకి అద్భుత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని చంద్రబాబు చేసిన ప్రయత్నాలను వైసీపీ నీరుగారుస్తుందని, చంద్రబాబు ఆనవాళ్లు తుడిచేందుకు రాష్ట్రాన్ని దివాలాతీయించేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజా విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జగన్ పాలనకు అద్దం పడుతున్నాయని రాజా విమర్శించారు. అమరావతి తమ ప్రాధాన్యత కాదని బుగ్గన చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. స్వయానా ఆర్థిక మంత్రి ఇలా మాట్లాడితే రాష్ట్ర భవిష్యత్తు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ హింస వైసీపీ ప్రాధాన్యంలా కనిపిస్తోందన్నారు. ఈ ప్రభుత్వ వైఖరి ప్రజలను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ప్రజా రాజధాని అమరావతిని అడుగడుగునా నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. రైతుల త్యాగాలు, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు వైసీపీ ప్రభుత్వానికి పట్టడం లేదని ఆలపాటి రాజా అన్నారు. రాజధాని తమ ప్రాధాన్యత కాదని ఒకమంత్రి... అమరావతి ముంపు అని మరొక మంత్రి మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రాన్ని ఎలా పరిపాలన చేద్దామని అనుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మెప్పు కోసమే బుగ్గన అలా మాట్లాడారనిపిస్తోందని, రాజధానికి అన్యాయం చేస్తే రాష్ట్ర ప్రజలకు మోసం చేసినట్లేనని అన్నారు. చంద్రబాబుకు పేరు రావద్దని ఇలాంటి దురాలోచన చేస్తున్నారన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల విషయంలో సర్కారు వైఖరి ఆందోళనకు గురి చేస్తోందని, కేంద్రం చెప్పినా పట్టించుకోకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆలపాటి రాజా విమర్శించారు.

# కేంద్ర బీజేపీ వేరు.. ఏపీలో బీజేపీ వేరు!

- సుజనా తీరుతో ఆవిషయంపై స్పష్టత వచ్చింది
- ట్విటర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

అమరావతి, నవంబర్22(ఆర్ఎన్ఎ) : ఎంపీ సుజనా చౌదరి వ్యాఖ్యలు చేస్తుంటూ కేంద్రంలో బీజేపీ వేరు.. ఏపీలో బీజేపీ వేరు అని మరోసారి అర్థమైందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన ట్విటర్ వేదికగా సుజనా చౌదరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎంపీ సుజనా చౌదరి పెట్టిన ప్రెస్ మీట్ చూస్తే భారతీయ జనతా పార్టీ(బీజేపి) వేరు... అందులో ఉన్న బాబు జనాల పార్టీ(బీజేపి) వేరు అని అందరికీ మరోసారి బాగా అర్థమైందని అన్నారు. వైసీపీ ఎంపీలు టచ్‌లో ఉన్నారంటూ సుజనా చౌదరి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి మీద చంద్రబాబు నాయుడు, ఆకలి మీద లోకేష్ నాయిడు, ఇసుక అక్రమాల మీద అచ్చెం నాయుడు, మహిళా రక్షణ మీద చింతమనేని, సంస్కారం మీద ఉమా, స్పీకర్ పదవి ఔన్నత్యం మీద యనమల లెక్చర్ ఇస్తే ఎలా ఉంటుందో... బ్యాంకు లూటీల భజనా చౌదరి ఏపీ ప్రయోజనాల గురుంచి ప్రెస్‌మీట్లు పెడితే కూడా అలాగే ఉంటుందని ఎద్దేవా చేశారు. ఈసారి సుజనా చౌదరి వెరైటీ ప్రెస్ మీట్ పెడితే బాగుంటుందని, విలేకర్లను కాకుండా తాను వేల కోట్ల మేర ముంచేసిన అర డజను బ్యాంకుల అధికారుల్ని ఎదుట కూర్చోపెట్టి వారి ప్రశ్నలకు ఆన్సర్ ఇస్తే... ఆయన పార్టీ ఎందుకు మారాడో, చంద్రబాబు ఆయనను ఎందుకు పార్టీ మార్చాడో అన్నీ అర్థమవుతాయని చురకలు అంటించారు. సుజనా వారి మాయా సామ్రాజ్యం మీద ఒకప్పుడు మొదటి పేజీలో తెలుగు పత్రికల్లో వరస కథనాలతో వోతెక్కించారని, ఇప్పుడు మాత్రం అదే పత్రికలు సుజనా చౌదరిని జస్టిస్ చౌదరిగా చూపించేందుకు తాపత్రయ పడ్డాయన్నారు. కారణం పబ్లిక్ ఇంట్రెస్టా? లేక పబ్లిక్‌గా తెలిసిపోయిన ఇంట్రెస్టా? అని విజయసాయిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాగా బ్యాంకులకు కోట్ల రూపాయల మేర నష్టం చేకూర్చినట్లు సుజనా చౌదరిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్వప్రయోజనాల కోసమే ఆయన బీజేపీలో చేరారంటూ విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

## పార్టీ మనుగడకోసమే..

# కడపలో చంద్రబాబు పర్యటన

- అధికారంలో ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధిని విస్మరించారు
- ఇప్పుడొచ్చి ఏం చేస్తారో చెప్పాలి
- వైసీపీ నేతలు సురేష్‌బాబు, రఘురామిరెడ్డి

కడప, నవంబర్22(ఆర్ఎన్ఎ) : కడప జిల్లాలో టీడీపీ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, అధికారంలో ఉన్నప్పుడు పెత్తనం చెలాయించిన వారంతా బీజేపీలోకి ఫిరాయించారని కడప పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం కడప జిల్లా పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.. ఈనెల 24,25, 26 తేదీల్లో ప్రతిపక్షనేత చంద్రబాబు జిల్లాలో పర్యటిస్తున్నట్లు చెబుతున్నారని, ఆయన పర్యటన ఖరారై రెండు సార్లు రద్దయిందన్నారు. ఎంపీ సీఎం రమేష్ బీజేపీలోకి వెళ్లడంతో మొదటిసారి, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పార్టీ మారడంతో మరోసారి రద్దయిందని చెప్పారు. కడప పర్యటన చంద్రబాబుకు అచ్చి రావడం లేదని ఎద్దేవా చేశారు. జిల్లా అభివృద్ధిని పట్టించుకోకుండా, అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు మూడు రోజులు పర్యటించని ఆయన ఇప్పుడు మూడు రోజులు పర్యటించడానికి గల కారణాలేమిటో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు వైసీపీ నాయకులను హతమార్చి, అనేక మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఆనాడు తీవ్రంగా నష్టపోయి అన్యాయానికి గురైనవారు నేడు స్పందన కార్యక్రమంలో అధికారులకు మొరపెట్టుకుంటున్నారని, పోలీసులు వారి అర్జీలపై నిష్పాక్షికంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చాక కాలువగట్లపై పడుకొని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఆ మాటను గాలికొదిలేసి ప్రాజెక్టుల పేరుతో వేలకోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పట్టిసీమ ద్వారా రాయలసీమకు నీళ్లిస్తున్నామని చెప్పి ఒక్కచుక్క ఇవ్వకపోయినా రూ.1600కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ తెచ్చేది మేమే ఇచ్చేది మేమే అన్న బాబు ఎంపీ సీఎం రమేష్‌తో 12 రోజులు దొంగ దీక్ష చేయించారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం హెల్త్ డ్రింక్ పేరుతో మద్యాన్ని ఏరులై పారిస్తే సీఎం వైఎస్ జగన్ నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి మద్యం దుకాణాలు, బార్లను తగ్గించి, సంపూర్ణ మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. జిల్లాలో పండిస్తున్న కేపీ ఉల్లిని ఎగుమతి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి లేఖ రాసినట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నగర అధ్యక్షుడు పులి సునీల్ కుమార్, కరిముల్లా పాల్గొన్నారు.

## మిడ్ మానేరు మరమ్మత్తులు పూర్తి: వినోద్

కరీంనగర్,నవంబరు 22((నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ మిడ్ మానేరు రిజర్వాయర్‌ని సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మిడ్ మానేరుకు మరమ్మత్తులు పూర్తయ్యాయన్నారు. మూడు నెలల్లోనే ప్రాజెక్టు మళ్లీ నింపామన్నారు. కొత్త ప్రాజెక్టుకు మరమ్మతులు సహజమని, మిడ్ మానేరును అత్యంత వేగంగా నిర్మించామన్నారు. మిడ్ మానేరు తెలంగాణ వాటర్ జంక్షన్ అని వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. అనుకున్న మేరకు కాళేశ్వరంపూర్తి కావడంతో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునే అవకావం వచ్చిందన్నారు.

# గుజరాత్‌లో దారుణ ఘటన

## కొడుకు లేడని కూతుళ్లను చంపి తల్లి ఆత్మహత్య

అహ్మదాబాద్,నవంబర్22(ఆర్ఎన్ఎ): గుజరాత్‌లోని మహిసాగర్ జిల్లా కదనా తాలూకాలో దారుణం జరిగింది. కొడుకు లేడన్న బాధతో ఓ మహిళ తన ముగ్గురు కూతుళ్లనుచంపి ఆత్మహత్య చేసుకుంది.

మంగు అనే మహిళ తనకు కుమారులు లేరన్న బ్యాదతో ఉన్న ముగ్గురు కూతుళ్లను బావిలో పడేసి అనంతరం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిత్వాస్ గ్రామంలో రమణ దమోర్ అనే వ్యక్తి మంగును ఏడు సంవత్సర క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఆ దంపతులకు శర్మిష్టా(5), సురా(03), భురీ(01) అనే కూతుళ్లు ఉన్నారు. మూడో కూతురు జన్మించిన తరువాత కుమారులు లేరని బాధపడుతుండేది. ఎప్పుడు ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తుండేది. బుధవారం సాయంత్రం భార్య అన్నం వండకపోవడంతో ఆకలిగా ఉందని పెద్ద కూతురు శర్మిష్టా తన తల్లిని అడిగింది. దీంతో వాళ్ల నానమ్మ అన్నం వండి పిల్లలకు పెట్టింది. అనంతర తన చిన్న కూతరు భూరీతో కలిసి ఆమె బయటకు వెళ్లి అర్ధరాత్రి ఇంటికి వచ్చింది. కుటుంబ సభ్యులు గాఢ నిద్రలోకి జారుకోగానే తన ముగ్గురు కూతుళ్లను తీసుకొని ఊరి బయటకు వెళ్లింది. ముగ్గురు కూతళ్లను బావిలోకి నెట్టేసి అనంతరం తాను బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భార్య పిల్లలు కనిపించక పోవడంతో భర్త రమణ తన బంధువులకు గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. గ్రామ శివారులో బావి వద్ద దుప్పట, స్వెట్టర్ ఉన్నాయి. బావిలోకి తొంగచూడగా ముగ్గురు పిల్లల మృతదేహాలు కనిపించాయి. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడి చేరుకొని కేసు నమోదు చేశారు. మోటర్ ద్వారా బావిలో నీటిని బయటకు తోడేయడంతో మంగు మృతదేహం కనిపించింది. వెంటనే నాలుగు మృతదేహాలను బయటకు తీసి శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఉరేసుకొని నవదంపతుల ఆత్మహత్య

- విశాఖలో విషాద ఘటన

విశాఖపట్నం, నవంబర్22(ఆర్ఎన్ఎ) : విశాఖ పట్టణంలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే ఫ్యాన్‌కు ఉరేసుకొని నవదంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమించి విహహం చేసుకున్న జంట ఆశలన్నీ కొంత కాలంలోనే ఆవిరైపోయాయి. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్టణం గాజువాక పెంటయ్యనగర్‌కు చెందిన నరేంద్రకుమార్, దిల్లేశ్వరి తల్లిదండ్రులకు తెలియకుండా గత జనవరిలో కులాంతర వివాహం చేసుకున్నారు. ఒంగోలులో వారి దాంపత్య జీవితాన్ని ప్రారంభించారు. ఆటోనగర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసే నరేంద్రకుమార్ జీతం అంతంతవాత్రంగానే ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలో వారిద్దరి మధ్య స్వల్ప వివాదాలు చేటుచేసుకున్నాయి. దీంతో తీవ్ర మానసిక సంఘర్షణకు లోనైన దంపతులు శుక్రవారం ఒకే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సరిపడా ఆదాయం రావట్లేదని, భవిష్యత్తుపై బెంగతో చనిపోయినట్టుగా స్థానికులు భావిస్తున్నారు. అయితే గత రెండు నెలల నుంచి ఈ జంట తిరిగి గాజువాకలో నివసిస్తున్నట్లు వారి తల్లిదండ్రులు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బాసర గుడి ఛైర్మన్ సస్పెన్షన్!

నిర్మల్, నవంబర్22(ఆర్ఎన్ఎ) : నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతీ దేవిదేవస్థానం ఛైర్మన్(ఫౌండర్ కుటుంబ సభ్యుడు) శరత్ పాఠక్ సస్పెండయ్యారు. దేవాదాయ శాఖ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయ భూమిని ఆక్రమించినందుకుగాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు దేవాదాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. బాసరలోని 447 సర్వే నంబరులోని 8.11 ఎకరాల భూమి అమ్మవారి దేవస్థానం పేరిట ఉంది. శరత్ ఈ భూమిలో కొన్నేళ్ళుగా పంటలను అనదికారికంగా సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో... ఆయనకు గతంలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ అధికారులు నోటీసులను కూడా ఇచ్చారు. దీంతో శరత్ కోర్టునాశ్రయించారు. ఈ క్రమంలో ఆయనకు తాత్కాలిక ఉపశమనం లభించింది. కాగా... ఇటీవల ఆలయ ఇన్‌ఛార్జ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా వచ్చిన వినోద్ రెడ్డి ఈ భూమి విషయమై దృష్టి సారించారు. ఆక్రమణ నిజమేనని తేలడంతో శరత్‌పై సస్పెన్షన్ విధించారు.

## పోకిరీని అరెస్ట్ చేసిన షీ టీమ్ బృందం

హైదరాబాద్,నవంబరు 21(ఆర్ఎన్ఎ): నగరంలోని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డుపై వెళుతున్న యువతులను వేధిస్తున్నాడని షీటీమ్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న షీటీమ్ బృందం యువకుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కళాశాలకు వెళ్లే విద్యార్థినిలు, యువతులు, మహిళలు వేధింపులకు గురికావాల్సిన అవసరం లేద ని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు దైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

పోనీలే అనుకుంటే బలహీనతగా భావించి పోకిరీలు రెచ్చిపోయేందుకు అవకాశం ఇచ్చిన వారం అవుతామని హితవు పలికారు. నిందితుడికి అతడి తల్లిదండ్రుల ఎదుట కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందని చెప్పారు.

# ఏపీలో త్వరలో రచ్చబండ

- జిల్లాల వారిగా తానిచ్చే హామీల అమలుపై దృష్టిపెట్టండి
- నవరత్నాల అమలే ప్రభుత్వానికి అధిక ప్రాధాన్యం
- ప్రజలపై భారంలేకుండా రాష్ట్ర ఖజానా రాబట్టాలి
- కేంద్ర నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తెచ్చేలా చూడాలి
- ఇందుకు ఢిల్లీలోని అధికారుల సేవలు వినియోగించుకోండి
- అధికారుల సమావేశంలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

అమరావతి, నవంబర్22(ఆర్ఎన్ఎ) : వచ్చే జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ఏపీలో రచ్చబండ కార్యక్రమం మొదలవుతుంది. ఈ మేరకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల పర్యటనల సందర్భంగా తాను ఇచ్చే హామీల అమలుపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. 'జనవరి– ఫిబ్రవరి నుంచి రచ్చబండ కార్యక్రమం ఉంటుందని, ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులపైన హామీలు ఇస్తానన్నారు. ఆ హామీలకు సంబంధించి కచ్చితంగా పనులు జరగాలని, మనం మాట ఇస్తే కచ్చితంగా చేయాలని జగన్ అధికారులకు సూచించారు. ఎలాంటి తాత్సారం ఉండకూడదని, ప్రభుత్వం ఎట్టి పరిస్థితులోనూ ఇచ్చిన మాటను నెరవేర్చలేదన్న మాట రాకూడదన్నారు. విశ్వసనీయత అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గకూడదని, ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని జగన్మోహన్‌రెడ్డి సూచి ంచారు. ఏదైనా పనికి శంకుస్థాపన చేస్తే నాలుగు వారాల్లోగా పనులు ప్రారంభం కావాలని, వచ్చే సమీక్షా సమావేశానికి జిల్లాల పర్యటన సందర్భంగా నేను ఇచ్చిన హామీలు కచ్చి తంగా నెరవేర్చాలన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే ఈ ప్రభుత్వం మరోసారి ఎన్నికవుతుందని, మేనిఫెస్టోను అమలు చేయగలిగితే.. ప్రజ లకు మేలు చేసినట్టే అని సీఎం జగన్ అధికారులతో పేర్కొన్నారు. అదేవిధంగా సామా న్యులపై భారం మోపకుండా ప్రభుత్వ ఖజా నాక టు ఆదాయం ఎలా పెంచుకోవచ్చో ఆలో చించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాధి పతులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తెచ్చుకో వాలని, ఇందుకు ఢిల్లీలోని అధికారుల సేవలు వినియోగించుకోవాలని సూచించా రు. గత ప్రభుత్వం రూ.40 వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించడంపై కొన్ని నెలలుగా దృష్టి పెట్టామని చెప్పారు. అనవ సర వ్యయాన్ని తగ్గించడానికి అధికారులు దృష్టి సారిం చాలని సీఎం కోరారు. ఈ ప్రభ ుత్వం ఏం చేసినా సంతృప్త స్థాయిలో చేస్తుం దనేది నిర్వి వాద అంశం కావాలని స్పష్టం చేశారు. నవరత్నాల అమలే ఈ ప్రభుత్వా నికి అధిక ప్రాధాన్యమని అన్నారు. మేనిఫెస్టో ద్వారా తమ ప్రాధాన్యతలు ఏం టో ఇప్పటికే ప్రజలకు తెలియజేశామన్నారు. వాటన్నిం టిని పరిష్కారం అయ్యేలా అధికార ులు కృషి చేయాలని జగన్మోహన్‌రెడ్డి సూచించారు.

## చంద్రబాబు, పవన్‌లకు..

# మతిభ్రమించి మాట్లాడుతున్నారు

- ఇంగ్లీష్ మీడియాంపై నానా రచ్చ చేస్తున్నారు
- తన బినామీలకు నష్టమొస్తుందనే బాబు భయం
- వైసీపీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రోజా

కడప, నవంబర్22(ఆర్ఎన్ఎ) : ఏపీ మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ల చిన్నమెదడు చితికిపోయిందని, అందుకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని వైసీపీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రోజాలు విమర్శించారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతుంటే చంద్రబాబు, పవన్ నానా రచ్చ చేస్తున్నారు. మరి ఎన్టీఆర్ భవన్ స్కూళ్లలో, వెంకయ్య నాయుడు స్వర్ణభారతిలో, రామోజీరావు స్కూళ్లలో, చంద్రబాబు బినామీ నారాయణ పాఠశాలలో ఉన్నది ఇంగ్లీష్ మీడియం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు బినామీలకు నష్టం వస్తుందన్న భయంతోనే ఇంగ్లీష్ మీడియాన్ని వద్దు అంటున్నారే తప్ప భాష మీద ఉన్న ప్రేమతో కాదని విమర్శించారు.

అదే విధంగా మహిళలకు అండగా ఉండాలని, వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలనే ఆలోచనతోనే సీఎం జగన్ దశల వారీగా మద్యపాన నిషేధం చేపట్టినట్లు తెలిపారు. నాలుగు దశల్లో రుణమాఫీ, వడ్డీ లేని రుణాలు అందిస్తున్న గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని స్పష్టం చేశారు. చదువుకున్న యువత నిరుద్యోగులుగా ఉండకూడదనే ఉద్దేశంతోనే సెక్రటరీ, వాలంటరీ ఉద్యోగాలను కల్పించిన ఘనత ఆయనదని ప్రశంసించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాష్ట్రం ఎలా ఉందో ప్రస్తుతం వైఎస్ జగన్ హయాంలో కూడా అలాగే అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక సహాయం అందించి వారిని అప్పుల ఊబిలో నుంచి బయటపడేలా చేస్తూ సీఎం జగన్ రైతు బాంధవుడయ్యాడని కొనియాడారు.

## విద్యా వ్యవస్థపై చర్చకు సిద్ధమా?

- వైసీపీది అప్పుడొకమాట.. ఇప్పుడొకమాట
- 'నాడు - నేడు' బోగస్ కార్యక్రమం
- టీడీపీ నేత బోండా ఉమా

విజయవాడ, నవంబర్22(ఆర్ఎన్ఎ) : విద్యా వ్యవస్థపై అసెంబ్లీలో చర్చించాలని, చర్చించేందుకు వైసీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందా? అని టీడీపీ నేత బోండా ఉమా సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. అధికారంలో లేనప్పుడు ఒకమాట.. అధికారంలోకి వచ్చాక ఒక మాట మాట్లాడకూడదన్నారు. విద్యా వ్యవస్థపై గతంలో వైసీపీ ఎలా వ్యవహరించిందో, జగన్ వ్యాఖ్యలు తదితర వాటికి సంబంధించిన విషయాలను ఆయన గుర్తుచేశారు. టీచింగ్ స్టాఫ్‌ను ముందుగా తీసుకొచ్చి పక్కాగా దీనిని అమలు చేయాలని సూచించారు. తమ ప్రభుత్వంలో ఉన్న సమయంలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండేదని, బీసీ, ఎస్సీ, మైనార్టీ కులాలు, పేదలు అత్యున్నతమైన స్థితిలో విదేశాల్లో ఉన్నారని ఉమా తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఉన్న సమయంలో బాబు ఐటీ రంగాన్ని పెద్ద ఎత్తున్న ప్రమోట్ చేశారన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం నాడు – నేడు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారని, కానీ..వివిధ భవనాలకు వైసీపీ పార్టీ రంగులను వేస్తున్నారని విమర్శించారు. దీనికి నేడు – రేపు పేరు పెట్టుకోవాలని, ఇదొక బోగస్ ప్రోగ్రాం అని విమర్శించారు. విద్యా వ్యవస్థలో తాము అనేక మార్పులు తీసుకొచ్చి పేదలకు అందించామన్నారు. విద్యా వ్యవస్థలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్ ప్లేస్‌లో ఉందని, 2016–17లో నీతి ఆయోగ్ నివేదిక ఇచ్చిందని బోండా ఉమా గుర్తు చేశారు. వైసీపీ వచ్చిన తరువాత విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇంగ్లీష్ విద్య అంటూ కొత్త నాటకం ఆడుతుందని విమర్శించారు. తమ హయాంలో మున్సిపాలి స్కూల్స్‌లో ఇంగ్లీష్ మీడియా అదీ తెలుగు ఆప్షన్‌తో ప్రవేశపెడితే వైసీపీ తీవ్రంగా వ్యతిరేఖించిందని ఉమా గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం తెలుగు ఆప్షన్ లేకుండానే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం అంటూ జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. అసలు టీచర్‌లకు ట్రైనింగ్ ఇవ్వకుండా ఇంగ్లీష్ భోధన అమలు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీని వల్ల విద్యార్థులకు అటు తెలుగు రాక, ఇటు ఇంగ్లీష్ రాక ఇబ్బందులు పడుతారని, తెలుగు భాష కనుమరుగయ్యే ప్రమాదముందని బోడా ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని సూచించారు.

## ప్రేమించిన యువతి కోసం...

# నగదు, నగలతో ఉడాయించిన యువకుడు

హైదరాబాద్,నవంబర్22(ఆర్ఎన్ఎ): ప్రేమించిన యువతి కోసం ఓ యువకుడు సొంతింట్లోనే దొంగతనానికి పాల్పడ్డాడు. కన్నతల్లి దాచుకున్న నగదు, బంగారు ఆభరణాలను దొంగలించి ప్రేమించిన యువతితో పారిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంజీవరెడ్డి నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోరబండ ఎన్.ఆర్.ఆర్.పురంకు చెందిన లక్ష్మీదేవి, ఎల్.వి.ఎస్. ప్రసాద్‌లు దంపతులు అనంతపురంలో నివసించే వారి బంధువు మృతి చెందడంతో వీరిద్దరు గత ఆగష్టు నెలలో అక్కడికి వెళ్ళారు. అయితే అదే బస్తీలో నివసించే ఓ యువతిని ప్రేమిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ససేమిరా ఒప్పుకోక పోవడంతో తల్లి దండ్రులు ఇంట్లో లేని సమయాన్ని చూసుకొని తల్లి లక్ష్మీదేవికి సంబంధించిన ఇంట్లోని అల్మారా లో దాచుకున్న 8 తులాల బంగారు ఆ భరణాలు, రూ. 50వేల నగదును తీసుకొని పారిపోయాడు. ఊరు నుంచి వచ్చిన త ల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్ళిన వారికి ఎంతకు కూమారుడు కనిపించక పోవడంతో ఇంట్లోని అల్మారాను తెరిచు చూసేసరిగి బంగారం, నగదు కనిపించక పోవడంతో అతనికోసం పలు చోట్ల ఆరా తీసారు. దీంతో కూమారుడు పై ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు దొంగతనానికి పాల్పడిన కుమారుడుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణలో పెరిగిన పంటల దిగుబడి

- ప్రాజెక్టులు సాకారంకావడంతోనే అన్న మంత్రి నిరంజన్
- సిఎం కెసిఆర్ పట్టుదల కారణంగానే నీటి సమస్యలకు చెక్
- అంతర్ కళాశాల క్రీడాపోటీలను ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్,నవంబరు 22(ఆంఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం పట్ల తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ కారణగా ఆయా పంటల ఉత్పాదకత భారీగా పెరిగిందని వ్యవసాయశాఖమంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సాగునీటి రాకతో ఉత్యానవన పంటలకు మంచి భవిష్యత్ ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ రరావు పట్టుదలతో సాగునీటి కల సాకారం అయ్యిందన్నారు. గురువారం కొండాలక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మొదటి అంతర్‌కళాశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వరిపంటలే కాకుండా ఇతర పంటలను సాగుచేసే పంటల మార్పిడి మీద రైతులు దృష్టిసారి ంచాలని మంత్రి పేర్కొన్నారు. ఒకటే పంట వేయడం వల్ల మేలైన ధరలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ప్రాంత నేలలు, వాతావరణం ఉద్యానప ంటలకు ఎంతో అనుకూలమని అన్నారు.

దేశ ఉద్యాన ఉత్పత్తుల అవసరాలు తీర్చే అవకాశం తెలంగాణకే వుందని అన్నారు. ములుగులో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో ఉద్యాన విశ్వవిద్యాలయ కళాశాల సిద్ధంగా వుందన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా త్వరలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. తెలంగాణలో కళాశాలలకు గతంలో అడ్డగోలుగా నుమతులు ఇచ్చి నిరుద్యోగాన్ని పెంచి పోషించారని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో ప్రక్షాళన చేపట్టిందని అన్నారు. రైతుల అవసరాలను తీర్చే, ఉపాధి కల్పించే వ్యవసాయ ఉద్యాన, పాలిటెక్నిక్ కళాశాలలకు అనుమతులు ఇస్తామన్నారు.

ఇప్పటికే వరంగల్, పాలెంలలో వ్యవసాయ కళాశాలలను ఏర్పాటు చేశామని అన్నారు. వ్యవసాయ, ఉద్యాన వన కళాశాల ప్రాంగణ ంలో వచ్చదనం వెల్లివిరియాలన్నారు. ఉద్యానవన కాలేజీలకు అనుబంధంగా ఉన్న మదనాపురం క్షేత్రానికి రామన్‌పాడు నీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశ్ఖాఖ కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న మంత్రి వారితో కరచాలనం చేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

# దేశం అబ్బురపడేలా తెలంగాణ పర్యాటకాభివృద్ధి

- సోమశిల వద్ద క్రూయిజ్ బోట్ ప్రారంభం
- పాలమూరుకు వలసలు వచ్చేలా అభివృద్ధి
- మంత్రి శ్రీనివాస గౌడ్ వెల్లడి

నాగర్ కర్నూల్,నవంబరు 22(ఆర్ఎన్ఎ): దేశం అబ్బురపడేలా తెలంగాణ టూరిజాన్ని తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమశిల దేవాలయం చరిత్ర పుస్తకంను ఆవిష్కరించిన శ్రీనివాస్ గౌడ్.. కృష్ణ నది పరివాహక ప్రాంతం వందల సంవత్సరాల నుండి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేసీఆర్ సీఎం అయిన తరువాత అభివృద్ధి చేసున్నారన్నారు. బౌద్ధవనం ప్రాజెక్టును ఆసియాలో ఎక్కడ లేని విధంగా ఏర్పాటు చేసున్నామన్నారు. పాలమూరుకే వలసలు వచ్చేలా టూరిజంను అభివృద్ధి చేస్తున్నామన్నారు

గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి తాము చేసి చూపిస్తున్నామన్నారు. తాము చేస్తున్న అభివృద్ధి చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయన్నారు. కేంద్రం నుండి 50 వేల కోట్లు వచ్చేలా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రయత్నం చేయాలన్నారు. దుబాయ్‌లో ఉన్న తెలంగాణ వాళ్ళను రాష్ట్రానికి తీసుకు వచ్చేలా ప్రయత్నం చేయాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలన్నారు. సోమశిల–శ్రీశైలం లాంచీ ప్రయాణం ప్రారంభమైంది. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల వద్ద ఏర్పాటు చేసిన క్రూయిజ్ బోట్‌ను రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అదేవిధంగా వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, కాటేజీలు, ఇతర పర్యాటక సౌకర్యాలను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హర్షవర్దన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంలో నల్లమల పరిస్థితి మారింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొల్లాపూర్ సమీపంలో సోమశిల సోమేశ్వరాలయం, సోమేశ్వరుడి పాదాలను కడుగుతున్నట్టుగా ఉండే కృష్ణానది.. అక్కడి నుంచి తూర్పువైపు శ్రీశైలం రిజర్వాయర్ వరకు సాగే ప్రయాణం మధురానుభూతిని కల్పించనున్నది. నదిలో నీరు పుష్కలంగా ఉండటంతో ఎనిమిది నెలలపాటు జలవిహారం చేసేందుకు అవకాశం ఉన్నది.

ఇప్పటికే తెలంగాణ పర్యాటక సంస్థ నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలంవరకు రెండు లాంచీలను నడుపుతుండగా.. ఇప్పుడు కొల్లాపూర్ సమీపంలోని పుణ్యక్షేత్రమైన సోమశిల, అమరగిరి తదితరప్రాంతాల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నది. నల్లమల అందాలను వీక్షిస్తూ సోమశిల నుంచి

శ్రీశైలం రిజర్వాయర్ చేరుకునే అవకాశం కల్పిస్తున్నది. గోదావరిలో పాపికొండల ఎత్తు సముద్రమట్టానికి రెండొందల మీటర్ల కన్నా మించదు. కానీ, సోమశిల నుంచి శ్రీశైలం వరకు విస్తరించి ఉన్న అమరగిరులు 400 మీటర్ల ఎత్తులో కనువిందు చేస్తాయి.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com